## 7.2.12 ప్రాంతీయ కవిత్వం

తమ అస్తిత్వాన్ని చాటుతూ ప్రాంతీయ చైతన్యం కోసం ఉద్యమించినదే ప్రాంతీయ వాద ధోరణి. తెలుగు సాహిత్యంలో ప్రాంతీయ స్పృహతో కళింగాంధ్ర కథలు తొలి తెలుగు సాహిత్య సంకలనంగా చాసో సంపాదకత్వంలో వెలువడింది. రాయలసీమ ప్రాంత కథలు సీమ కథలుగా వెలువడ్డాయి. ప్రత్యేక తెలంగాణ నినాదంతో 1969లో వచ్చిన ఉద్యమం సాహిత్యరంగంలో పెద్దగా ప్రభావం చూపలేదు. 1990 తరువాత ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణ ప్రాంతీయ చైతన్యంగా రూపొంది సాహిత్యంలో చోటు చేసుకుంది.

అణచివేతకు గురవుతున్నామనే భావంతో తెలంగాణ ప్రాంతవాసులు మేల్కొని ముందుకువచ్చే ప్రయత్నం మొదలయ్యింది.[1]

ఎవరి అనుభవాలను వారి భాషలోనే వ్యక్తం చేయాలనేవాదం మొదలై స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం ఏకమయ్యే సమయంలో ప్రాంతీయ స్పృహ కూడ ఊపందుకుంది. ఆంధ్రదేశంలోని ఇతర ప్రాంతాలవారి సంఖ్య బలం పెరగటం తెలంగాణ ప్రాంతవాసులకు అభద్రత పెరగటం, భాషాపరమైన, సాంస్కృతిక పరమైన విభేదాలకు, అపహాస్యాలకు పాలుకావడం, రాజకీయంగా ప్రాంతీయతను నిలదొక్కుకోవాలనే భావం ఇవన్నీ ప్రాంతీయ స్పృహకు తోడయ్యాయి.

జూలూరు గౌరీశంకర్ రచించిన నా తెలంగాణ ప్రాంతీయ స్పృహకు ఒక రూపా న్నిచ్చింది. ప్రాంతీయ స్పృహతో వీరి సంపాదకత్వంలో 2002లో పొక్కిలి కవితా సంకలనంలో 129 మంది తెలంగాణ కవుల కవితలతో వెలువడింది. ప్రాంతీయ స్పృహ, అస్తిత్వ ప్రకటన ఈ కవితలలోని ప్రధానాంశాలు.

1. గుడిపాటి వెంకటేశ్వర్లు, తెలుగు సాహిత్యం-తెలంగాణ చైతన్యం, ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, సంపాదకులు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2005, పుట 148.



తెలంగాణవాదం కాదు. తెలంగాణ కవిత్వం మాత్రమేనని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆకాంక్షించే రాజకీయ ఆర్థిక భావజాలం తాత్త్విక దృక్కోణంగా వుండే కవిత్వాన్ని తెలంగాణవాద కవిత్వంగా గుర్తించి కేవల తెలంగాణ కవిత్వాన్ని వేరు చేయాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారు.

ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వమంటే తెలంగాణ కవిత్వమనే ముద్రపడింది. ఇతర ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో కథల్లోనే సామాజిక జీవనం కనిపిస్తుంది. 'సీమ కవిత'లోను ప్రాంతీయ అస్తిత్వ స్పృహ పరిమితంగానే ఉంది. తమ ప్రాంత అస్తిత్వం కోసం ప్రాంతీయ ఉద్యమాలు మొదలయ్యాయి విప్లవ దళిత మైనారిటీ అస్తిత్వ వాదులు ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని బలపరచాయి. నందిని సిధారెడ్డి భూమిస్వప్నం, సంభాషణ, అల్లం నారాయణ తెలంగాణా పల్లె, వరవరరావు ముక్తకంఠం, భవిష్యత్ చిత్రపటం, కందుకూరి శ్రీరాములు వయొలిన్, రాగమో వసంతమేమో, పొట్లపల్లి శ్రీనివాస రావు మూడో కన్ను, అయిలయ్య రహస్య చిత్రం రచనలలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ స్పృహ కనిపిస్తుంది.

"ప్రపంచమే ఆడుతున్న రోజులివి
ఎవరి యెదమౌన లోయల్లో ప్రవేశించినా
మణి మారాజు వాసనే !...
సరళీకృత రూపాయినే కాదు
సబ్సిడీ రూపాయిని కూడా మార్చలేవు
ఇప్పుడు మనిషంటే
నిలువునా నడిచే రక్తమాంసాలు కాదు
పల్లానికి దొర్లుకుంటూ పోయే గుండ్రని
రూపాయి నాణెం మాత్రమే !"[1]

1. మత్తడి, తెలంగాణ కయిత, సం. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, అంబటి సురేంద్రరాజు, తెలంగాణా సాంస్కృతిక వేదిక, హైదరాబాదు, 2002, పుట 207, 210, 211.

"నైతిక విలువలంతరించిన ఈ రాత్రి
నగరంలో ఇంకా ఏం మిగిలిందని...?
అందుకే అర్థిస్తున్నా –
అడవుల కడుపుల్లో రగిలే ఓ కార్చిచ్చూ !
ఒక్కసారి ఈ నగరం పొలిమేరల్లోకి రా !
దయచేసి దహన సంస్కారం చేసి పో...!"[1] – దహన సంస్కారం

నాగరికత పేరుతో నైతిక విలువలు అంతరించిన నగరంలో రోడ్ల మృత కళేబరాలు, అంతస్తుల దెయ్యాలు, దోపిడీ క్లబ్బులతో ప్రతి రోజు రాత్రి నగరం అంతా భయంకర శ్మశానంగా తయారవుతుంది.

అడవుల కడుపుల్లో రగిలిన కార్చిచ్చును నగరం పొలిమేరలకు వచ్చి దహన సంస్కరం చేసిపోమంటున్నారు. నగరంలో అడుగంటుతున్న మానవతా విలువలను నిలబెట్టే ప్రయత్నంలో విప్లవాన్ని ఆశ్రయిస్తున్నారు అలిశెట్టి ప్రభాకర్.

"విశ్వం కుగ్రామమైనందుకు క్షణం గర్వపడదాం
విశ్వం విఫణి వీథిగా మారినందుకు
మనసులోనే తనివితీరా విలపిద్దాం...
మనిషి ఏకాకి ద్వీపంగా మారటం వ్యక్తిత్వ వికాసం
ప్రేమించే రోజులాగే మనిషిగా జీవించటానికీ
ఒక రోజుంటే బాగుంటుందేమో !" [2] – వైరస్

1. మత్తడి, తెలంగాణ కయిత, సం. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, అంబటి సురేంద్రరాజు, తెలంగాణా సాంస్కృతిక వేదిక, హైదరాబాదు, 2002, పుట 207, 210, 211.
2. మత్తడి, తెలంగాణ కయిత, సం. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, అంబటి సురేంద్రరాజు, తెలంగాణా సాంస్కృతిక వేదిక, హైదరాబాదు, 2002, పుట 207, 210, 211.



ప్రపంచీకరణ నేపథ్యంలో త్వరితగతిన మారిపోతున్న సమాజాన్ని దానికి పట్టిన వైరస్‌ను కవితా మయం చేసి చిత్రీకరించారు పెన్నా శివరామకృష్ణ.

వ్యక్తి సమష్టి రూపాన్ని సాధించటానికి ఎన్ని యుగాలు పట్టిందో ఒక్క రక్తపుబొట్టు కూడా చిందకుండానే సర్వం విధ్వంసమైంది. హెచ్.ఐ. వీసాలు, డాలర్ కలలు అదృశ్య ఆత్మీయతా బంధాలకు వైరస్ సోకి విశ్వం వ్యాపార ప్రపంచమయింది.

"తెలంగాణా స్త్రీ
స్త్రీవాదులకు తెలుసా?
వలస ఎంత ? వాదమెంత ?
కోస్తా పురుషోత్తములముందు మేం
సెకండ్ సెక్సే ? మాకు
నీలిమేఘాలు కాదు
మేఘాలు కావాలి
అస్తిత్వం కోసమే అస్తిత్వం
నాయకత్వం కోసమే ఉద్యమం
విప్లవం రారాదు
నాయకత్వం పోరాదు...
భాష నీది – నీ భాషలో వ్యక్తంగాని జీవితం నాది"[1] – నల్లవలస

తెలుగు సాహిత్య చరిత్రలో వచ్చిన కవితాసంకలనాలలో తెలంగాణా కవులు ప్రస్తావన విస్మరించిన వైనం తెలంగాణ కవుల కవితల్లో వ్యక్తమవుతుంది. గురజాడ నుండి నేటి తెలుగు సాహిత్య చరిత్రలో అడుగుజాడలు, మహాప్రస్థానాలు, అనువాదాలు, విమర్శలు, ఆకాశవాణి, పత్రిక, చలన చిత్రం అన్నిటికీ నాయకులు ఆంధ్రులేనని విమర్శించారు. స్త్రీవాదులకు తెలంగాణ స్త్రీ తెలుసా? తెలంగాణ స్త్రీలను విస్మరించారు. అస్తిత్వం కోసమే అస్తిత్వం, ఉద్యమాలు కూడా నాయకత్వం కోసమే గాని ప్రజాభివృద్ధి కోసం కాదని, విప్లవం రారాదని, నాయకత్వం పోరాదని భావించే కొందరి పాక్షిక దృష్టికి పై కవిత నిదర్శనం.

1. మత్తడి, తెలంగాణ కయిత, 2002, పుట 284, 286.